కథ

# ఎక్స్ఛేంజ్ ఆఫర్

శ్రీప్రసాద్

ఆఫీసుకు టైమవుతున్నట్లు గోడ గడియారం చూపిస్తోంది. నారాయణ్‌కు బల్ల మీద ఉంచిన తన చేతి గడియారం కనిపించలేదు. టేబుల్ సొరుగుల్లో కూడా వెదికాడు. అయినా కనిపించలేదు. అతనికి టెన్షన్ మొదలైంది.

'కాంతం' కేకేశాడు. అతని భార్య కాంతం దొడ్లో ఉన్నట్లుంది. అతని కేకకు ఆమె నుండి ఎటువంటి రెస్పాన్సూ రాలేదు.

అతనికి భార్య మీద విసుగొచ్చింది. 'ఆఫీసుకు వెళ్లే సమయానికి తనకేమన్నా కావాలా? అన్న విషయం పట్టించుకోకుండా దొడ్లో పనిమనిషితో బాతాకానీ చేస్తూ ఉంటుంది' అనుకున్నాడు.

'సరేలే సాయంత్రం తీరిగ్గా వెతుక్కోవచ్చులే! ఇంట్లోనే ఎక్కడో ఒక చోట ఉండకపోదు' అనుకుంటూ లంచ్ బేగ్ అందుకుని వెలుపలికి నడిచాడు.

వీధి వాకిట్లోంచీ, "ఆఫీసుకు వెళుతున్నా తలుపేసుకో" అని మరోసారి కేక పెట్టాడు. ఈసారి ఆ కేక కాంతంకు వినిపించినట్లుంది.

"అలాగే" అని అరిచింది దొడ్లోంచే.

"మొగుడు ఆఫీసుకు బయలుదేరేటప్పుడన్నా కాస్త వెలుపలికొచ్చి సాగనంపాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేని మనిషి" అని భార్యను మనసులోనే నసపెట్టుకుంటూ ఆఫీసుకు బయలుదేరాడు నారాయణ్.

చేతి గడియారం కనబడకపోయేసరికి అతనికి మనసంతా చికాకుగా ఉంది. అందులోనూ అది అతనికి సెంటిమెంట్ గడియారం. దాన్ని దాదాపు పన్నెండేళ్ల క్రితం టెన్త్‌క్లాస్ పరీక్షలప్పుడు వాళ్ల నాన్న కొనిపెట్టాడు. ఆ గడియారాన్ని ప్రతీరోజూ పెట్టుకు వెళ్లి పరీక్షలు రాశాడు. అన్ని సబ్జెక్టులలోనూ మంచి మార్కులు వచ్చి స్కూల్ ఫస్టు వచ్చాడు. అప్పటి నుంచి అతనికి ఆ గడియారం మీద 'లక్కీ వాచ్' అనే నమ్మకం ఏర్పడింది.

ఇంటర్మీడియట్ పరీక్షలప్పుడూ, డిగ్రీ పరీక్షలప్పుడూ కూడా ఆ గడియారం వల్లే ఫస్టుక్లాసులో పాసయ్యాడని అతని ఉద్దేశ్యం.

ఉద్యోగ నియామకం కోసం జరిగే ఎ.పి.పి.యస్.సి. వారి పోటీ పరీక్షకు కూడా ఆ గడియారాన్ని పెట్టుకెళ్లాడు. అందులో నెగ్గి స్టాటిస్టికల్ ఆఫీసరుగా ఉద్యోగం సంపాదించాడు.

అటువంటిది ఆ రోజు ఆ వాచ్ కనబడకపోయేసరికి అతనికి మనసంతా బాధతో నిండిపోయింది.

సాయంత్రం ఆఫీసు నుండి రాగానే కనీసం బట్టలన్నా మార్చుకోకుండా గడియారం కోసం వెతకడం మొదలుపెట్టాడు.

భర్తను చూసి, "ఏమిటండీ వెతుకుతున్నారు?" అంటూ అక్కడకు కాఫీ గ్లాసుతో వచ్చింది కాంతం.

"నా గడియారం కనిపించడం లేదు కాంతం. ఉదయం ఇక్కడే ఈ టేబుల్ మీదే పెట్టాను. మళ్లీ చూస్తే కనిపించలేదు. నువ్వేమైనా చూశావా?" అని అడిగాడు నారాయణ్ కాంతాన్ని.

"ముందు కాఫీ తాగండి" అంటూ కాఫీ గ్లాస్ అందించి లోనికి వెళ్లింది కాంతం.

కాఫీ గ్లాసందుకొన్న నారాయణ్, 'గడియారం ఏమైందబ్బా' అని ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుని కాఫీ సిప్ చేయసాగాడు.

కొంతసేపటి తర్వాత కాంతం గదిలోంచీ ఓ కొత్త టైటాన్ గడియారంతో ఇవతలకు వచ్చింది.

"ఇదెక్కడిది?" అడిగాడు నారాయణ్

"మీ కోసమే కొన్నానండీ" అంది కాంతం.

"నాకు నా పాత వాచ్ ఉందిగా! మరో గడియారం ఎందుకు కొన్నావ్?" అన్నాడు నారాయణ్.

"ఆ వాచ్‌ని ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లో మార్చే ఈ గడియారం కొన్నానండి. అందువల్ల ఇరవై ఐదు శాతం డిస్కౌంట్ వచ్చింది. మీ పాత గడియారం అమ్మితే వంద రూపాయలు కూడా చేయదు. ఈ గడియారం రెండు వేలు. రెండువేల మీద ఇరవై ఐదు శాతం డిస్కౌంట్ అంటే ఐదు వందల రూపాయలు. అంటే ఆ పాత వాచ్‌ని ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లో మార్చినందువల్ల ఐదు వందలు వచ్చిందన్నమాటే గదా!" అంది కాంతం.

"నా వాచ్ మార్చేశావా?" అదిరిపడ్డాడు నారాయణ్.

అతనికి కోపం నషాళానికి అంటింది.

"ఎందుకు మార్చావ్? ఎవర్నడిగి మార్చావ్?" అంటూ పెద్దగా కేకలు వేశాడు.

అతని కోపం చూసి జంకి ఒకడుగు వెనక్కు వేసింది కాంతం.

"అది...అది... నాకు సెంటిమెంట్ వాచ్ అని నీకు తెలుసు గదా!" అన్నాడు కోపంతో. "దానివల్ల నేను ప్రతీ ఎగ్జామ్‌లోనూ ఫస్టుక్లాసులో పాసయ్యానని నీకు ఇదివరలో చెప్పాను గదా!"

కోపంతో అతని ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

"గుమ్మడికాయేం గాదూ! మీరు బాగా చదవబట్టి అన్ని పరీక్షల్లో ఫస్టుక్లాసులో పాసయ్యారు. చదవకుండా ఉత్త గడియారం పెట్టుకు వెళ్లి పరీక్షలు రాసుంటే కనీసం పాసయినా అయుండేవారా?" అంది కాంతం చిరాగ్గా. "మంచి ఆఫర్ అని ఆ డొక్కు వాచ్ మార్చి కొత్త వాచ్ కొన్నాను తప్పా."

ఆ రోజంతా ఇద్దరి మధ్యా వాదనలు జరిగాయి.

ఆ రాత్రికి ఇద్దరూ అలిగి అన్నం తినకుండా పడుకున్నారు. భార్యాభర్తల కోపాలు ఎంతకాలం ఉంటాయి? ఎవరో ఒకరు సర్దుకుపోవాలి గదా!

తాను చేసింది, "ఏమాత్రం తప్పుకాదు" అని కాంతం పట్టుబట్టేసరికి నారాయణే మరుసటి రోజుకు సర్దుకుపోయాడు.


ఒకరోజు టీవీ చూద్దామని టీవీ ముందు కూర్చున్న నారాయణ్‌కు తమ పాత బి.పి.యల్. టీవీ బదులు కొత్త శామ్‌సంగ్ ఊఫర్ టీవీ కనిపించింది.

"కాంతం" కేకేశాడు.

అతని కేక విని వంటింటిలోంచీ పరుగున వచ్చింది కాంతం.

"టీవీ ఎక్కడిది?" ఆమె వైపు గుర్రుగా చూశాడు నారాయణ్.

"నేనే కొన్నాను. ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లో పాతది



మార్చి కొత్తది కొన్నాను పాత దాంట్లో ముప్ఫై ఛానల్స్ మించి రావు. ఈ కొత్తదాంట్లో రెండు వందల ఛానల్స్ వస్తాయి. అందులోనూ ఇది ఫ్లాట్ స్క్రీను. ఎక్స్‌ట్రా ఊఫర్ సిస్టమ్ వంటి లేటెస్ట్ టెక్నాలజీ ఉన్న టీవీ. అంతేకాదు దీన్ని కొంటే ఓ ట్రావెల్ బేగ్ కూడా ఫ్రీగా ఇచ్చారు" అంది కాంతం.

"రెండొందల ఛానల్స్ వస్తే రెండొందల ఛానల్సూ చూడగలమా? మనం నిత్యం చూసి ఏడ్చేది తెలుగు ఛానల్సు నాలుగే గదా! ఎప్పుడైనా నువ్వు నన్ను టీవీ చూడనిస్తే ఏ ఎన్.జి.సి.నో, బి.బి.సి.నో చూస్తాను. ఆ ఛానల్స్ అన్నీ మన పాత టీవీలో వస్తున్నాయి గదా! మనం చూడందానికి ఎన్ని వందల ఛానల్సు వస్తే మాత్రం ప్రయోజనం ఏముంది?" ఇంతెత్తున లేచాడు నారాయణ్.

"మనం చూడనంత మాత్రాన మనకు కేవలం ముప్ఫై ఛానల్స్ వచ్చే టీవీ చాలా. కేబుల్ వాడికి మనం, ఐదారు ఛానల్సే చూస్తున్నారు డబ్బు తగ్గించుకోమంటే తగ్గించుకుంటాడా? నా ఫ్రెండ్స్ ఎవరైనా మనింటికి వస్తే ఆ పాత టీవీలో వచ్చే ముప్ఫై ఛానల్స్‌తో సర్దుకుపోతున్నామని చెప్పడానికి నాకు సిగ్గనిపిస్తోంది" అంది కాంతం కూడా రుసరుసలాడుతూ.

మళ్లీ ఇద్దరి మధ్యా వాదనలు జరిగాయి.

ఈసారి అలకలదాకా పోకుండా (పోయినా ఇక ఒరిగే ప్రయోజనమేమీ లేదు గనుక) ముందే సర్దుకుపోయాడు నారాయణ్.

కాంతానిది గెలుపైంది.

ఓసారి పాత సి.డి.ప్లేయర్ ఎక్స్‌ఛేంజ్ ఆఫర్‌లో మార్చి కొత్త డి.వి.డి. ప్లేయర్ కొంది.

ఇంకోసారి సెల్‌ఫోను మార్చేసింది.

మరోసారి వాషింగ్‌మెషిన్ మార్చేసింది.

ప్రతీసారీ భార్యాభర్తల మధ్య వాదనలు జరిగేవి. కొత్తగా కొన్న వస్తువులలో ఏదో ఒక ప్లస్ పాయింటు చూపెట్టి వాదనలో చివరకు కాంతమే గెలిచేది.

దబ్బు దండగ అంటే ఒప్పుకునేది కాదు.

నారాయణ్‌కు సర్దుకుపోక తప్పేది కాదు.

క్రమంగా ఎక్స్‌ఛేంజ్ ఆఫర్‌లో వస్తువులను మార్చేయడం కాంతానికి అలవాటైపోయింది.

పాత వాటిని మార్చి కొత్తవి కొన్న ప్రతీసారీ లబలబలాడేవాడు నారాయణ్. కాంతం అతన్ని పట్టించుకునేది కాదు.

అలా మార్చేసిన వాటిలో కుక్కరు, మిక్సరు, ఫ్రిజ్‌లు కూడా చేరాయి. చివరకు పట్టుచీరలు కూడా ఎక్స్‌ఛేంజ్ ఆఫర్‌లో మార్చేసి కొత్తవి కొంది. 'సొంత ఇల్లు లేదు కాబట్టి సరిపోయింది. లేకుంటే పాత ఇంటి బదులు కొత్త ఇల్లు కొనమని కూర్చుంటే నా గతం కాను' అనుకున్నాడు నారాయణ్.

ఆమెనెలా మార్చాలో అర్థంకాక సతమతమైపోసాగాడు.

ఓ రోజు...

"మా చెల్లెలికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారట. నన్ను ఒకసారి వచ్చిపొమ్మని మా నాన్న ఫోన్ చేశాడు. నేను ఓసారి మా ఊరికి వెళ్లి వస్తాను. ఓ వారం పాటు మీకు హోటల్ తిండి తప్పదు" అంది కాంతం.

సరే అన్నాడు నారాయణ్.

ఆమె ఊరికి వెళ్లిన పక్కరోజు ఓ చక్కటి ఆలోచన వచ్చింది నారాయణ్‌కు.

వెంటనే మామగారికి ఓ లెటర్ రాసి పడేశాడు.

పోస్టులో పంపితే ఆలస్యమవుతుందని కొరియర్‌లో పంపాడా ఉత్తరాన్ని.

ఆ ఉత్తరంలో...

గౌరవనీయులైన మామగారికి.

అల్లుడు నారాయణ్ నమస్కరించి రాయునది. మీరు మీ చిన్నమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారట గదా! మీ పెద్దమ్మాయి చెప్పింది. అందుకే ఈ ఉత్తరం రాస్తున్నాను. అన్యదా భావించవద్దు.

నాలుగేళ్లుగా మీ పెద్దమ్మాయితో కాపురం చేస్తున్న నాకు మీ పెద్దమ్మాయి లక్షణాలు కొన్ని వచ్చాయి. అందుకే ఓ చక్కటి ఆలోచన వచ్చి ఈ ఉత్తరం రాస్తున్నాను.

మీ అమ్మాయి పుణ్యమా అని నాకూ ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ వచ్చింది. మీరు ఒప్పుకుంటే మీ పెద్దమ్మాయిని ఎక్స్‌ఛేంజ్ చేసి చిన్నమ్మాయిని పెళ్లి చేసుకుందామనే ఆలోచన వచ్చింది. మీ పెద్దమ్మాయి మనసు నాకు చక్కగా తెలుసు. నాలుగేళ్లుగా నాతో కాపురం చేసిన మీ పెద్దమ్మాయికి ఈసరికే పాత మొగుడినైన నాపై మోహం మొత్తుంటుంది. అందుకని ఈ ఎక్స్‌ఛేంజ్ ఆఫర్‌కు ఆమె కూడా తప్పక ఒప్పుకుంటుంది. అంతేకాదు ఈ ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ వల్ల మీకూ మంచి లాభం ఉంటుంది. కట్నంలో భారీగా కన్సెషన్ ఇస్తానని మాటిస్తున్నాను.

ఏ విషయం వెంటనే ఫోన్ చేయ ప్రార్థన.


ఇట్లు,

మీ అల్లుడు,

నారాయణ్.

## రంభ కోరిక

*'నాచోరే నాచోరే' అంటూ ఇటీవల 'యమదొంగ' సినిమాలో ఐటమ్ నంబర్‌లో కుర్రకారుచేత నాట్యం చేయించిన రంభకి ఓ కోరిక వుందిట. మరేం లేదు... దాదాపు అన్ని భాషల్లోనూ నటించాలని వుందిట. ఇప్పటిదాకా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ, భోజ్‌పురి లాంటి భాషల్లో నటించిన రంభ త్వరలోనే ఓ ఇంగ్లీషు సినిమాలో కూడా నటిస్తోందిట. మరిన్ని కొత్త భాషా చిత్రాల్లో నటించి మెప్పించాలని అనుకుంటోందిట రంభ. ఆమె కోరిక తీరాలనే*



ఉత్తరం మామగారికి అందిన వెంటనే ఎలాంటి ప్రతిస్పందన ఉంటుందో ఊహించాడు నారాయణ్.

అతను ఊహించినట్లే రెండో రోజు ఉదయానికే అతని మామగారు, కాంతాన్ని వెంటబెట్టుకొని అతని ఇంటి ముందున్నాడు.

లెటర్‌ను అతని మీదకు విసురుతూ, "ఏంటల్లుడూ ఇది?" అన్నాడు కోపంగా.

"వివరంగానే రాశానే. అర్థం కాలేదా?" అన్నాడు నారాయణ.

"ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ ఏమిటి? పెద్దమ్మాయిని మార్చి, చిన్నమ్మాయిని చేసుకోవడమేమిటి?" మండిపడ్డాడు అతని మామగారు.

"మీకు మీ పెద్దమ్మాయి చెప్పలేదా? ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ మీ పెద్దమ్మాయికి కొత్తేం కాదులెండి. పాత వస్తువులను మార్చి కొత్త వస్తువులను కొంటుంటుంది. ఈ ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ వల్ల పాత వస్తువులను లాభానికి వదిలించుకోవచ్చు. వాటి బదులు తళతళలాడే కొత్త వస్తువులను కొనుక్కోవచ్చు. ఆమె బాటలోనే నడిచిన నేను మరో అడుగు ముందుకేసి భార్యను ఎక్స్‌ఛేంజ్ చేద్దామనుకుంటున్నాను." అన్నాడు నారాయణ్.

అతని మామగారు అతనివైపు అయోమయంగా చూశాడు.

కాంతానికి అతని ఉద్దేశ్యం అర్థమైంది.

వెంటనే ముందుకు నడిచి అతని కాళ్లపై బడి బావురుమంది.

"ఇక ఎక్స్‌ఛేంజ్ ఆఫర్స్ అంటే చెప్పుతో కొట్టండి" అంది.

నారాయణ్ ఆమె భుజం పట్టి పైకిలేపి, "పిచ్చిదానా! నిన్ను మార్చాలనే అలా ఉత్తరం రాశాను. నువ్వు లేకుండా నేనెలా బతకగలను చెప్పు" అన్నాడు.

అప్పుడు కుర్రాడొకడు ఓ పాంప్లేట్ లోనికి విసిరేసి వెళ్లాడు.

ఆ పాంప్లేట్‌లో పెద్దపెద్ద అక్షరాలలో కనబడింది.

"ఎక్స్‌ఛేంజ్ మేళా" అని.

కాంతం ఆ కరపత్రాన్ని చింపి వీధిలోకి విసిరింది.

అది చూసి నారాయణ్ మనసు ఆనందంతో నిండిపోయింది.